క్లుప్తంగా

టెండర్లు రద్దు

జమ్మలమడుగు : మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మార్చి నెలలో నిర్వహించిన టెండర్లను రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి ఆమె మాట్లాడారు. వేసవి కాలం కావడంతో పట్టణంలో నీటిఎద్దడి రాకుండా అధికారులు చూడాలని సూచించారు. అనంతరం సభ్యులు గెజిట్‌లో 30 అంశాలు ఉండగా మెజారిటీ సభ్యులు కొన్ని అంశాలను ఆమోదించగా మరి కొన్ని అంశాలపై సభ్యులు వ్యతిరేకించారు. ఇటీవల జరిగిన మార్కెట్ టెండర్లలో సిండికేట్ ఏర్పాటు అయి మున్సిపాలిటికి రావలసిన ఆదాయం కంటే తక్కువ రావడంతో సభ్యులు వ్యతిరేకించారు. దీంతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

పులివెందుల టౌన్ : వేసవి కాలంలో రక్తం ఎక్కువ అవసరం ఉంటుందని.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీప్రియ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ గర్భసంచి శస్త్ర చికిత్స కోసం రక్తం అత్యవసరం కావడంతో వైద్యురాలు లక్ష్మీప్రియ స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తదాన శిబిరాలు తక్కువగా ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైన వారికి రక్తదానం చేయాలన్నారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయండి

చింతకొమ్మదిన్నె : మండలంలోని హౌసింగ్ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీకేదిన్నె మండల ఉపాధ్యాక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కడప నగరంలోని హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ కృష్ణయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో చాలామంది లబ్ధిదారులు హౌసింగ్ బిల్లులు తమఖాతాల్లో జమకాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయనకు వివరించారు.

కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతాం

పులివెందుల రూరల : ఏపీఎస్ఆర్టీసీ రవాణా సంస్థలో కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్గోలో బుక్ చేసిన ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి ఇతర ప్రాంతాలకు రవాణా చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారి నుంచి ఆదేశాలు రావడంతో కార్గో పార్శిల్‌పై నిఘా పెంచుతున్నామన్నారు. హైదరాబాద్ తదితర రాష్ట్రాల నుంచి మద్యం, గుట్కా వంటి మాదక ద్రవ్యాలను బస్సులలో సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్శిల్ చేసే వారినుంచి ఆధార్ కార్డును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ముద్దనూరు : ఈ ఏడాదిలో జరగనున్న వేసవికాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి బీజేపీ ప్రభుత్వం మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ బిల్లుకోసం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

జీ-20 అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు గౌరవం

వైవీయూ : జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం తీసుకోవడం మనందరికీ ఎంతో గౌరవమని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జీ-20 సమ్మిట్ థీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2023 నవంబర్ 30వ తేదీ వరకు జీ-20 అధ్యక్ష బాధ్యతలను మనదేశం నిర్వహిస్తుందన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు థీమ్‌గా జీ-20 సమ్మిట్ ఉందన్నారు. అనంతరం ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ మేజర్ సహేంద్రసింగ్, బల్వంత్‌సింగ్‌లు జీ-20 సమ్మిట్ గురించి, దేశం ప్రపంచదేశాల్లో సాధించిన ప్రగతి గురించి వివరించారు. లెఫ్టినెంట్ మహేష్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీ రామాయణ సప్తాహం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో గురువారం నుంచి ఈనెల 12 వరకు శ్రీ రామాయణ సప్తాహం నిర్వహించనున్నట్లు శ్రీ బిట్ర పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు కాకనూరు సుబ్బారెడ్డి తెలిపారు. పుట్టపర్తికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు వి.అన్నాజీరావు పాల్గొంటారన్నారు.

మాట తప్పని వ్యక్తి సీఎం జగన్

ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి



వీఎస్‌పల్లెలో మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మైలవరంలో ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : డ్వాక్రా మహిళలకు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటను నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో వెలుగు ఏపీఎం భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను ఎవరూ కట్టవద్దని వాటి వడ్డీ మొత్తం చెల్లిస్తానని చెప్పి కనీసం వడ్డీ కూడా చెల్లించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఎంత రుణం ఉంటే అంత రుణాన్ని నాలుగు విడతలుగా చెల్లిస్తానని హామీ ఇచ్చాడన్నారు. మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతలు మహిళల ఖాతాల్లో జమచేయడమే కాకుండా ప్రస్తుతం మూడో విడత జమచేశాడన్నారు. ప్రతి మహిళల ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం 555 సంఘాలకు సంబంధించి రూ.4,11,31,300 చెక్కును మహిళలకు ఆయన అందజేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. సంబరాల్లో భాగంగా పాలగిరి గ్రామానికి చెందిన మహిళలు చేసిన కోలాటం అందరిని ఆకట్టుకొంది. కార్యక్రమంలో యువనాయకుడు నరేన్ రామాంజుల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక ఎంపీటీసీ రాఘవ యాదవ్, తహసీల్దార్ ఉదయభారతి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళల భవితకు భరోసా...

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మహిళల భవితకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి రుణమాఫీ చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మైలవరంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్ ఆసరా 3వ విడత రుణ మాఫీ చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అందరికీ పథకాలు మంజూరు చేశారన్నారు. గత తెలుగుదేశం హయాంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సంతకాలు లేనిదే పథకాలు ఇచ్చే వారు కాదన్నారు. తిరిగి ఎలాగైన అధికారం దక్కించుకోవడానికి మోసపూరిత మాటలతో ప్రజల ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళలు చంద్రబాబునాయుడు చేప్పే మాటలను నమ్మవద్దని ఆయన హితవు పలికారు. అనంతరం రూ.4 కోట్ల 66 లక్షల చెక్కును మహిళలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రామచంద్రారెడ్డి, ఎంపీపీ సావిత్రి, ఉపాధ్యక్షులు నాగ ఉదయిని, భీమయ్య, జడ్పీటీసీ మహాలక్ష్మీ, మార్కెట్‌యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ రమణారెడ్డి, చాపల సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు జగదీశ్వరరెడ్డి, సోనుభాయ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వేముల : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారి జీవితాలలో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. మంగళవారం స్థానిక తిరుమలనాయుని గుట్టపై వెలసిన శ్రీమంజునాథేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండల వ్యాప్తంగా 4989 డ్వాక్రా సంఘాలకు రూ.4.10కోట్ల మేర వైఎస్సార్ ఆసరా పథక సొమ్మును ఖాతాలలో జమ చేశారన్నారు. మహిళల కోసం వారి ఆర్థికాభివృద్ధి కోసం పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పులివెందుల అనంతరం మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఏసీ నీలకంఠారెడ్డి, ఏపీఓ గంగరాజు, ఏపీఎం జిలాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమాదేవి, కో ఆప్షన్ సభ్యులు మండిమా పీరా, సర్పంచ్ సాకే రామాంజనమ్మ, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, వెలుగు సీసీలు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా మహిళలకు గొప్ప వరం

లింగాల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు అందిస్తున్న వైఎస్సార్ ఆసరా మహిళలకు ఒక వరమని ఎంపీపీ ఎం.అమృత అన్నారు. మంగళవారం లింగాల స్త్రీశక్తి భవన్‌లో వైఎస్సార్ ఆసరా మూడవ విడత డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. కరోనా కష్టకాలంలోనూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికి ఇచ్చిన వాగ్దానాలను నవరత్నాలు అమలుపరిచి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటున్న మన ముఖ్యమంత్రిని తిరిగి వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి మహిళా కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్ మాట్లాడుతూ మండలంలోని 528 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత కింద రూ.4.38కోట్లు మంజూరైందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వై.పుష్ప, మండల ఉపాధ్యక్షురాలు రమాదేవి, లింగాల సర్పంచ్ అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు బాబురెడ్డి, వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె సర్పంచ్‌లు మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, ఏపీఎం రామాంజనేయులు, వీఓఏలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పథకాలే శ్రీరామరక్ష



వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల నాయకులు

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని మండలంలోని జంబాపురం పంచాయతీ వైఎస్సార్ సీపీ అడ్డా అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, జంబాపురం సర్పంచ్ ఇందిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శుక్రవారం జంబాపురం పంచాయతీ పరిధిలోని గొళ్లపల్లె, సలతిమ్మాయపల్లెలో పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మండల నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జంబాపురం పంచాయతీలోని గ్రామాల్లో మొత్తం 120 కుటుంబాలు మాత్రమే ఉన్నాయని, వారిలో 100 కుటుంబాలు టీడీపీలో చేరారని టీడీపీ నాయకులు ఆర్భాట ప్రకటనలు చేశారన్నారు. దీంతో గ్రామస్తుల్లో తిరుగుబాటు మొదలై వారిలో అధిక సంఖ్యాకులు తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, గంగిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

వల్లూరు : ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న పుష్పగిరి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీ కామాక్షీ వైదనాథేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై మంగళవారం ఆలయాల ఈఓ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు.

గిరి ప్రదక్షిణ విషయంలో ఏకపక్ష పోకడలపై విమర్శలు

గత రెండు దఫాలుగా నిర్వహిస్తున్న పుష్పగిరి ప్రదక్షిణ కార్యక్రమ నిర్వహణలో ఏక పక్ష ధోరణిపై సమావేశంలో వాడి వేడి చర్చ జరిగింది. పుష్పగిరికి సంబంధించి ఆలయాల ధర్మకర్త, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులకు సంబంధం లేకుండా పుష్పగిరి పేరుతో ఏవేవో పేర్లు పెట్టుకుని ఏక పక్ష ధోరణితో కార్యక్రమాలను నిర్వహించడాన్ని సమావేశంలో పాల్గొన్న పలువురు ఖండించారు. కొంత మంది గిరి ప్రదక్షిణ పేరున నిధులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని ఇది సరికాదని వారు తెలిపారు. పుష్పగిరి గిరి ప్రదక్షిణపై పుష్పగిరి పీఠాధిపతితో త్వరలో సమావేశమై ఒక నిర్ణయం తీసుకుందామని సమావేశంలో పాల్గొన్న పలువురు పెద్దలు సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, పెద్దలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, యర్రగుడిపాడు చెన్నకేశవరెడ్డి, సతీష్, పుష్పగిరి గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందిస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : అర్హులైన ప్రతినిరుపేదకు సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కన్నెలూరులోని శివాలయం వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతో కలసి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, బోరును మరమ్మత్తు చేయించాలని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమ పథకాలు కావాలంటే వారికి డబ్బులు ఇస్తేనే వర్తించేవన్నారు. కానీ నేడు ఎటువంటి డబ్బులు చెల్లించకుండా వారి ఖాతాలలోనే డబ్బులు జమ అవుతున్నాయన్నారు. సమాజం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న సిద్ధాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయంతోపాటు, వైద్య విద్య, సంక్షేమం వైపు పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మార్బల్ శ్రీను, హృషికేశవరెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి మల్కిరెడ్డి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపత్‌కుమార్ దాతృత్వమే 'బ్రౌన్'కు ఊపిరి

కడప కల్చరల్ : నగరానికి చెందిన ప్రముఖ ఆడిటర్ సీకే సంపత్‌కుమార్ దాతృత్వమే బ్రౌన్ గ్రంథాలయ స్థాపనకు ముఖ్య కారణమైందని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉప కులపతి ఆచార్య జింక రంగజనార్ధన అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బ్రౌన్ కేంద్రం స్థల దాత, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సీకే సంపత్‌కుమార్ 21వ వర్ధంతి నిర్వహించారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సిబ్బంది గ్రంథాలయ ఆవరణలోని సంపత్‌కుమార్ విగ్రహానికి, అనంతరం చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం సంపత్‌కుమార్ ఆయన సేవలను కొనియాడారు. బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు పాల్గొన్నారు.

ప్రణాళికే విజయానికి తొలిమెట్టు

- గ్రూప్–2 శిక్షణ తరగతుల్లో వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన

వైవీయూ : సానుకూల దృక్పథం, మొక్కవోని ఆత్మవిశ్వాసం, ప్రణాళికబద్ధమైన సన్నద్ధత ఉన్నప్పుడే పోటీపరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలోని సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 ఉద్యోగ పరీక్షల శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఎస్సీ సభ్యులుగా పనిచేసిన వీసీ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షల సన్నద్ధత, షెడ్యూలు అమలుచేస్తూ నాణ్యమైన మెటీరియల్ చదవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి , వైవీయూ సెంటర్ ఫర్ కాంపిటీషన్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డాక్టర్ నాగుల అంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో పోటీపరీక్షల విభాగం సమన్వయకర్త మనోజ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సురభి' మినీ ఆడిటోరియం ప్రారంభం

జిల్లా చరిత్రను విశ్వవిఖ్యాతం చేసి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన సురభి నాటక సమాజం రాబోయే తరానికి గుర్తుండిపోవాలని వీసీ రంగజనార్ధన పేర్కొన్నారు. వైవీయూలోని హ్యూమానిటీస్ భవనంలో నూతన సమావేశ మందిరాన్ని 'సురభి మినీ ఆడిటోరియం'గా నామకరణం చేసి రిజిస్ట్రార్ ,ప్రిన్సిపాల్‌తో కలిసి ప్రారంభించారు. లలితకళల విభాగం ఆచార్యులు డా. మూల మల్లికార్జునరెడ్డి , ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య, ఐక్యూఏసీ డైరెక్టర్ డా. ఎల్. సుబ్రమణ్యంశర్మలు పాల్గొన్నారు.

వలంటీర్ ఔదార్యం



సావిత్రమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణానికి చెందిన ఆలూరు సావిత్రమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో కడపలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మంగళవారం ఆ వృద్ధురాలికి పింఛన్ అందించేందుకు వలంటీర్ మహమ్మద్ రఫి కడపకు వెళ్లి చికిత్స పొందుతున్న సావిత్రమ్మకు పింఛన్ డబ్బులు అందించారు. దీంతో ఆమె వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

బకాయిలు 90 శాతం వసూళ్లు

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిల 90 శాతం వసూళ్లు అయినట్లు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ రెవెన్యూ సిబ్బందిని సత్కరించారు. పది సంవత్సరాలుగా వసూళు కానీ బకాయిలను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వసూలు చేసిన ఆర్ఓ గంగిరెడ్డితో పాటు ఆయన రెవెన్యూ బృందం ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పనిచేయాలన్నారు. మార్చి 31వ తేదీన సుమారు రూ.9 లక్షలు వసూలు చేయడం ఇదే మొదటిసారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, ఏఈలు సురేష్, సందీప్, శానటరీ ఇన్స్‌పెక్టర్ మధుకుమార్, సీఓలు విమల, వసంత్, వార్డు అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పాఠశాల హెచ్‌ఎం ఖాజాపరీవ్సన్ ఆధ్వర్యంలో సంఘమిత్ర, సెహతమంత్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు రూ.40వేలు విలువ చేసే దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ పాఠశాలలో 600 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారని.. గత ఏడాది పదవ తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అనంతరం భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు రంజాన్ తోఫా సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంఘమిత్ర, సెహతమంత్ ఫౌండేషన్ల అధ్యక్షులు సిరాజుద్దీన్, నిజాముద్దీన్, ఎంఈఓ వీరారెడ్డి, ఐఈఆర్టీ యశోద తదితరులు పాల్గొన్నారు.

'వన్‌స్టాప్'సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల వెంకట లక్ష్మి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్ (సఖి, దిశ)ను ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బాధిత మహిళలకు ఆశ్రయం కల్పిస్తూ వారి సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అడ్మినిస్ట్రేటర్‌పై ఉందన్నారు. అలాగే మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం అడ్మినిస్ట్రేటర్ అశ్విని, ఎస్ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పనులను వెంటనే పూర్తి చేయాలి



చిన్నరంగాపురంలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. చిన్నరంగాపురంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో పారిశుధ్య నిర్వహణపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీలలో పిచ్చి మొక్కలను వెంటనే జేసీబీ ద్వారా తొలగించాలన్నారు. అనంతరం మెయిన్ రోడ్డు పక్కన గల వాటర్‌ట్యాంక్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో వార్డు సచివాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అవసరమైన చోట రోడ్డు, నీటి సరఫరా పైపులైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివలక్ష్మి, మున్సిపల్ డీఈ సుభాష్ చంద్రబోస్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఏఈలు, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయండి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ సచివాలయ పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల గురించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, లక్ష్మీభార్గవి, పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని.. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నవరత్నాలలో భాగంగా పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు.

అన్నదాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



మార్కెట్ యార్డు ట్రేడర్స్, చీనీ రైతులతో చర్చిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : అన్నదాతల ఆనందమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని పాడా ఓఎస్డీ కార్యాలయంలో మార్కెట్ యార్డు ట్రేడర్స్, చీనీ రైతులతో కలిసి మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డిలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ మాట్లాడుతూ మార్కెట్‌లో ఎలాంటి సూట్ లేకుండా చీనీ కాయలను వ్యాపారులు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు న్యాయమైన ధరలు అందించాలని ట్రేడర్స్‌ను కోరారు. ఈనెల 10వ తేదీ నుంచి వ్యవసాయ మార్కెట్‌లో చీనీ వ్యాపారుల మండి ప్రారంభమవుతుందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ నియోజకవర్గంలోని అన్ని మండలాల హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలతో సమావేశమై జగనన్న హౌసింగ్ కాలనీల్లో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీ అజాద్‌వల్లి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

14 నుంచి ప్రచార యాత్రలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సమైక్యత కోసం ఈ నెల 14 నుంచి మే 14 వరకు ప్రచార యాత్రలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు వెల్లడించారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. మోదీ ఆర్థిక అవకతవకలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు.

ఏఎఫ్‌యూలో ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ముందస్తుగా బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెం వై.పవన్‌కుమార్‌రెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.